క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్యాబోధన



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

జగిత్యాలరూరల్: ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్యాబోధన జరుగుతుందని సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.రమేశ్‌బాబు అన్నారు. బుధవారం కళాశాలలో మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అధ్యాపకులు శ్రీధర్, రాజు, రాజేందర్, వెంకటేశ్వర్లు, సుజాత, సౌజన్య, సంపత్‌రావు, ప్రశాంత్‌కుమార్, శ్రావణ్, ఆర్య, మురళీమోహన్, జ్యోతిక, లైబ్రేరియన్ గంగరాజు పాల్గొన్నారు.

కాలిన ట్రాన్స్‌ఫార్మర్

జగిత్యాలరూరల్: ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో వరి నారుమడులు దున్నే రైతులు విద్యుత్ మోటారు నడవకపోవడంతో 12 రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. కన్నాపూర్ గ్రామంలోని ఎస్సీకాలనీ వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్ 12 రోజుల క్రితం కాలిపోయింది. గ్రామస్తులు, రైతులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారమందించారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించకపోవడంతో రైతులు వరి నారు పోసేందుకు విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రహదారుల మరమ్మతు చేపట్టాలి

మెట్‌పల్లి: అన్ని వార్డుల్లో దెబ్బతిన్న రహదారులను గుర్తించి మరమ్మతు చేపట్టాలని కమిషనర్ మోహన్ సూచించారు. 14వ వార్డులో బుధవారం వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి పర్యటించారు. వార్డులో పలుచోట్ల రోడ్లపై ఉన్న గుంతలను శిథిలావస్థలో ఉన్న ఇళ్లను తొలగించగా వచ్చిన మట్టితో పూడ్చివేయించారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా నాగరాజు



మల్లాపూర్: బీజేవైఎం మండల అధ్యక్షుడిగా పందిరి నాగరాజును వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగరాజుకు బుధవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు వద్దేపల్లి శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు.

జగిత్యాలటౌన్: బీజేపీ పట్టణ నూతన కార్యవర్గాన్ని బుధవారం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు ఆదేశం మేరకు జరిగిన ఈ నియామకంలో పట్టణ ప్రధాన కార్యదర్శులుగా ఆముద రాజు, సిరికొండ రాజన్న, ఉపాధ్యక్షులుగా ముద్దం రాము, ఠాకూర్ పవన్‌సింగ్, గాదాసు రాజేందర్, ఇట్యాల రాము, కార్యదర్శులుగా మేడిపల్లి పుష్పారెడ్డి, నక్క జీవన్, గడ్డల లక్ష్మీహరి, వొడ్నాల మహేశ్, కోశాధికారిగా మర్రిపెల్లి సాగర్, సభ్యులు ఎన్నికయ్యారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రంజిత్



రాయికల్: లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా న్యాయవాది కొత్తపెల్లి రంజిత్‌కుమార్ (రాయికల్), ప్రధాన కార్యదర్శిగా బొడగం అంజిరెడ్డి(ఇటిక్యాల), కోశాధికారిగా బెక్కం తిరుపతి(మూటపల్లి) ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు బత్తిని భూమయ్య, మ్యాకల రమేశ్ బుధవారం తెలిపారు. రంజిత్ మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ద్వారా నిరుపేదలకు సేవలందిస్తానన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మాండ్లు, మచ్చ శేఖర్, కడకుంట్ల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కులస్తుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

మల్లాపూర్: వడ్డెర సామాజికవర్గం సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు బోసు రాము వడ్డెరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 30లక్షల జనాభా కలిగిన వడ్డెర కులాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు గడిచినా గుర్తించకపోవడం దారుణమన్నారు. కుల వృత్తిలో చాలామంది మృతిచెందుతున్నారని, ప్రమాద బీమా కింద రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని డిమాండ్ చేశారు.

కేసుల పరిష్కారానికి కృషి

కోరుట్లటౌన్: వృద్ధుల నిరాదరణ కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్(టాస్కా) రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక టాస్కా కార్యాలయంలో వృద్ధులపై వేధింపుల నివారణపై అవగాహన కల్పించారు. 16 మంది వృద్ధులను సన్మానించారు. తల్లిదండ్రులను ఆదరించకుంటే మూడు నెలల జైలు, జరిమానా విధించే వీలుందన్నారు. టాస్కా డివిజన్ అధ్యక్షులు పబ్బా శివానందం, చిలుక గంగారాం, గంటెడి రాజ్‌మోహన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో గ్రేడింగ్

- పిల్లల సంఖ్య పెంచేలా చర్యలు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ తప్పనిసరి



గుండంపల్లిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి నారాయణ, అంగన్‌వాడీ టీచర్లు(ఫైల్)

మల్లాపూర్: అంగన్‌వాడీ కేంద్రాలను ఇకనుంచి మొక్కుబడిగా నిర్వహించకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షణ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చిన్నారులు కేంద్రాలకు వచ్చి పోవడంతోనే సరిపెట్టకుండా వారికి ఆటాపాట నేర్పించాలనే దానిపై దృష్టి పెట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వనున్నట్లు ఇటీవల ఉన్నతాధికారులతో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పిన విషయం తెలిసిందే. మంచి గ్రేడింగ్ ఉన్న కేంద్రాలకు అవార్డులను సైతం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులు లేరనే సాకులతో కేంద్రాలను మూసివేయడం సరికాదని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకొని సంఖ్యను పెంచడంపై దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మార్చుకునే అవకాశం

ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే ఎక్కువ సంఖ్య వచ్చే అవకాశమున్న ప్రాంతాలకు కేంద్రాలను మార్చుకునే అవకాశం కల్పించింది. ప్రతీ కేంద్రంలో తప్పనిసరిగా 20 మంది సంఖ్య ఉండేలా నిర్వాహకులు చూసుకోవాల్సి ఉంటుంది. బడిబాట తరహాలోనే గ్రామాల్లో చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు ఐసీడీఎస్ అధికారులు, ఆయా కేంద్రాల నిర్వాహకులు ప్రయత్నాలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే కేంద్రాల నిర్వహణ సరిగా లేదనే భావన ఉంది. చిన్నారుల సంక్షేమంపై భారీగా ఖర్చు పెడుతున్నా.. అధికారులు సరిగా పని చేయడం లేదని ప్రభుత్వం దృష్టిలో ఉంది. దీన్ని సరి చేసేందుకు గాను ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని యోచిస్తోంది. అందులో భాగంగానే జిల్లా సంక్షేమాధికారులు వారానికి కనీసం మూడు కేంద్రాలనైనా సందర్శించేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

కొనుగోలు కమిటీల ద్వారా టెండర్లు

అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు సరఫరా అయ్యేలా ప్రభుత్వం దృష్టి పెట్టింది. సరుకుల కొనుగోళ్ల విషయంలో సొంత నిర్ణయాలకు అవకాశం లేకుండా చేసింది. ఈ–టెండర్ విధానాన్ని పాటించేలా సూచనలు జారీ చేసినట్లు సమాచారం. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కొనుగోలు కమిటీ ద్వారా టెండర్లు పిలవాలని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. కోడిగుడ్లు సరిగా సరఫరా జరిగేలా చూసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

కేంద్రాల పనితీరుపై దృష్టి



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచుకునేందుకు గాను అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం చేపడతాం. కేంద్రం నిర్వాహకులు ప్రతీ ఇంటికెళ్లి చిన్నారుల గురించి ఆరా తీస్తారు. రెండేళ్లు నిండిన చిన్నారులను కేంద్రాలకు పంపించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. సంఖ్య తక్కువగా ఉన్న కేంద్రాలను ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు మార్చుతాం. కేంద్రాల పనితీరుపై దృష్టి పెడతాం.

– బోనగిరి నరేశ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, జగిత్యాల

రెవెన్యూ సదస్సు సద్వినియోగం చేసుకోవాలి



నర్సింగాపూర్‌లో తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు

జగిత్యాలరూరల్: భూభారతితో రైతుల భూసమస్యలు పరిష్కారమవుతాయని, సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం నర్సింగాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్, ఆర్‌ఐలు భూమయ్య, శంషోద్దీన్, సీనియర్ అసిస్టెంట్ గంగారాం, జూనియర్ అసిస్టెంట్లు నిరంజన్, జయ, రాజేందర్, అనిల్, శ్రీనివాస్, శ్రీలత, గంగరాజం, రాజేందర్, భాస్కర్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు గురువారంతో ముగియనున్నాయని తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో ఇప్పటివరకు 217 దరఖాస్తులు వచ్చాయన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్‌ఐలు రేవంత్‌రెడ్డి, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: చింతకుంట, భూషణరావుపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. చింతకుంటలో 33 మంది, భూషణరావుపేటలో 22 మంది రైతులు భూసమస్యలపై దరఖాస్తు సమర్పించారు. తహసీల్దార్ వినోద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ నాగేశ్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: నాచుపల్లి గ్రామంలో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు భూసమస్యలపై దరఖాస్తులు అందజేశారు.

గొల్లపల్లి: శ్రీరాములపల్లి గ్రామంలో భూభారతి కార్యక్రమం తహసీల్దార్ వరందన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు లక్ష్మణ్, దనవ్వ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతికి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం హర్షణీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి భార్గవరామ్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి, కాల్ల రాజయ్య, నర్సయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం



రాయికల్: పట్టణంలోని మార్కండేయ ఆలయంలో బుధవారం లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకుడు నారాయణస్వామి ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం చేశారు. అర్చకులు మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం 108 గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ప్రైవేటు విద్యాసంస్థలను సీజ్ చేయాలి



జగిత్యాల: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి అన్నారు. జగిత్యాలలో మాట్లాడుతూ.. మూతపడుతున్న స్కూళ్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమీర్, అక్రమాలిక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

కొడిమ్యాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు మెరుగైన వసతులున్నాయని కొడిమ్యాల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేణు అన్నారు. కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తోపాటు నాణ్యమైన ఇంటర్ విద్య అందించడానికి ప్రభుత్వం పలు సౌకర్యాలను కల్పిస్తోందన్నారు.

అక్షరాభ్యాసమే విద్యాభ్యాసానికి తొలి అడుగు

వెల్గటూర్: అమ్మ ఆది గురువని, అమ్మతో అక్షరాభ్యాసం విద్యాభ్యాసానికి తొలి అడుగని పాశిగామ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం పాశిగామ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ మాజీ సర్పంచ్ బొప్పు తిరుపతి విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

విద్యార్థికి అభినందన

జగిత్యాల: ఎస్‌కేఎన్‌ఆర్ జూనియర్ కళాశాలలో 2022–24లో ఇంటర్ చదువుకున్న విద్యార్థి మిట్టపల్లి గణేశ్ ఇటీవల ఇంటర్నేషనల్ కోస్టల్ గార్డ్‌గా ఉద్యోగం సాధించాడు. ఇరాక్‌లో కోస్టల్ గార్డ్‌గా విధుల్లో చేరాడు. నాలుగు నెలల తర్వాత బదిలీపై గుజరాత్‌కు వచ్చాడు. గణేశ్‌ను ప్రిన్సిపాల్ సత్కరించారు.

పోస్టర్ ఆవిష్కరణ

ధర్మపురి: బీజేపీ అధికారం చేపట్టి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా సంకల్ప సభలను నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద బుధవారం సంకల్ప సభల పోస్టర్లను ఆవిష్కరించారు. కుమ్మరి తిరుపతి, అంజన్న, కామెర ప్రభాకర్ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ మృతి

మల్యాల: ముత్యంపేటలోని దిగువ కొండగట్టుకు చెందిన కుదురుక గంగరాజం అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. గంగరాజం నాలుగేళ్లుగా కాళ్లకు గాయాలై ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా తగ్గలేదు. బుధవారం కొండగట్టు వద్ద పురుగుల మందు తాగాడు. 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఝాన్సీలక్ష్మీబాయి సాహసం స్ఫూర్తిదాయకం

జగిత్యాలటౌన్: వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి ధైర్య సాహసాలు నేటి తరానికి ఆదర్శం కావాలని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు అన్నారు. ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతి సందర్భంగా బుధవారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన లక్ష్మీబాయి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కినపెల్లి కాశీనాథం, పుప్పాల సత్యనారాయణ, చిట్ల గంగాధర్, బండారి మల్లికార్జున్, ఎడమల వెంకట్‌రెడ్డి, తునికి అంజన్న, బొందుకూరి శ్రీనివాస్, అరుణ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయాలి

జగిత్యాలటౌన్: ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడంతోపాటు కార్మిక హక్కుల పరిరక్షణకు జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కోకన్వీనర్ ఇందూరి సులోచన అధ్యక్షతన బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక, మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తోందన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల శ్రమదానం

రాయికల్: పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద అపరిశుభ్రంగా ఉండడంతో స్పందించిన యూత్ కాంగ్రెస్ నాయకులు షాకీర్, రాకేశ్‌నాయక్‌తోపాటు యువజన సంఘాల సభ్యులంతా కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ధర్మపురి: పట్టణంలో లోవోల్టేజీ సమస్యతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవతో రూ.23లక్షలు మంజూరు చేశారు. పట్టణంలోని 3వ వార్డులో బుధవారం స్తంభాలను ఏర్పాటు చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ జక్కు రవీందర్, విద్యుత్ శాఖ అధికారులు, మాజీ కౌన్సిలర్లు తదితరులున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

కథలాపూర్: స్థానిక సంస్థల ఎన్నికలకు యూత్ కాంగ్రెస్ నాయకులు సిద్ధం కావాలని వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు న్యాత నవీన్ పిలుపునిచ్చారు. బుధవారం కథలాపూర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో మండలస్థాయి యూత్ కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కాశవత్రి వంశీ, మండలాధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, నాయకులు అర్జున్, సాయితేజ, సంతోష్, అనిల్, మహిపాల్, రంజిత్, ప్రేమ్, మధురెడ్డి పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

జగిత్యాలటౌన్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ సంచాలక్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వాల్మీకి ఆవాసం, సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ రెండో బ్యాచ్‌ను ప్రారంభించారు. వాల్మీకి ఆవాసం ద్వారా ఉచిత ట్యూషన్, బాల సంస్కార కేంద్రాలు, కుట్టు, కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆవాసం ప్రధాన కార్యదర్శి నందెల్లి మదన్మోహన్‌రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన నిర్వాహకులు

జగిత్యాలరూరల్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులను నిర్వాహకులు మోసం చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రంలో 18 మంది రైతులు ధాన్యం విక్రయించారు. అందులో తూకం వేస్తున్న సమయంలో 43కిలోల300గ్రాముల చొప్పున తూకం వేశారు. తూకం వేసిన ధాన్యాన్ని నిర్వాహకులు రైస్‌మిల్లులకు తరలించారు. నిర్వాహకులు రైతుల నుంచి ధాన్యం వివరాలు ట్యాబ్‌లో పొందుపర్చి ఓటీపీ కూడా తీసుకున్నారు. రైతులకు తక్కువ డబ్బులు పడడంతో బుధవారం నిర్వాహకులను నిలదీశారు. ఒక్కో రైతుకు 2–6 బస్తాల వరకు కటింగ్ పెట్టారు. తమ ధాన్యాన్ని ఎందుకు కటింగ్ పెట్టారంటూ ఆందోళన చేపట్టారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌కో ఉద్యోగుల ఫోన్ నంబర్లు

పెగడపల్లి: మండలంలోని ట్రాన్స్‌కో ఉద్యోగుల ఫోన్ నంబర్లు మారినట్లు గొల్లపల్లి సబ్ డివిజన్ ట్రాన్స్‌కో ఏడీఈ వరుణ్‌కుమార్ బుధవారం తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తిన సమయంలో మారిన నంబర్లకు ఫోన్ చేసి సమాచారమందించాలని కోరారు. వరుణ్‌కుమార్ సబ్ డివిజనల్ ఏడీఈ గొల్లపల్లి 8712486290, పెగడపల్లి ఏఈ వెంకట్‌రెడ్డి 8712486291, బతికపల్లి ఏఈ 8712486266, పెగడపల్లి సబ్ స్టేషన్ 8712486305, నందగిరి సబ్ స్టేషన్ 8712486312, ఎల్లాపూర్ సబ్ స్టేషన్ 8712486236, బతికపల్లి సబ్ స్టేషన్ 8712486293, లింగాపూర్ సబ్ స్టేషన్ 9440330337, రంగదాముని పల్లి సబ్ స్టేషన్ 8712486313, సత్యనారాయణరావు లైన్ ఇన్స్‌పెక్టర్ పెగడపల్లి 9812486301, భిక్షపతి లైన్‌మెన్ పెగడపల్లి 8712486143, శేఖర్ లైన్‌మెన్ ఎల్లాపూర్ 8712486144, పూదరిరెడ్డి లైన్‌మెన్ బతికపల్లి 8712486296, రాజేశం లైన్‌మెన్ బతికపల్లి 8712486141, ప్రభాకర్ లైన్‌మెన్ మద్దులపల్లి 8712486142, రామ్‌సంజీవ్ లైన్‌మెన్ నందగిరి 9908860509.



మెట్‌పల్లిరూరల్: ఎస్సారెస్పీ కాకతీయ కాల్వ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వెల్లుల నుంచి రామారావుపల్లె వరకు పలుచోట్ల కాల్వ సిమెంట్ లైనింగ్ దెబ్బతింది. కొన్నిచోట్ల మాత్రం లైనింగ్ పూర్తిగా దెబ్బతినడంతో ప్రమాదకరంగా ఉంది. అధికారులు దృష్టి సారించి మరమ్మతు చేయించాలని ఆయా ప్రాంతాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
దేవానంద్, ఇరిగేషన్ డీఈఈ, ఇబ్రహీంపట్నం సబ్ డివిజన్, సెల్ నంబర్: 9490011210

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పదవుల కేటాయింపులో ప్రాధాన్యం



మల్లాపూర్: భూమిపూజ చేస్తున్న నర్సింగరావు

కోరుట్ల: మొదటి నుంచి పార్టీలో పని చేసినవారికి తప్పకుండా పదవుల కేటాయింపులో ప్రాధాన్యముంటుందని కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. స్థానిక సినారె భవన్‌లో పార్టీ పదవుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. పరిశీలకులుగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కన్వీనర్ కత్తి వెంకటస్వామి, పీసీసీ కమిటీ కార్యదర్శి, జిల్లా కోఆర్డినేటర్ అంజన్‌కుమార్ హాజరయ్యారు. కొమొరెడ్డి కరం, కొమొరెడ్డి విజయ్ ఆజాద్, పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, అన్నం అనిల్ పాల్గొన్నారు.

మల్లాపూర్: రాష్ట్రంలోని ఇల్లు లేని పేదలకు గూడు కల్పించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి ముగ్గు పోశారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా ఫోన్ చేసి తెలపాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడపుల పుష్పలతనర్సయ్య, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, వన సంరక్షణ సమితి చైర్మన్ సిరిపురం రవీందర్, కాంగ్రెస్ సేవాదల్ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కోటగిరి ఆనంద్‌గౌడ్, రామలక్ష్మణ్, మిట్టపల్లి జీవన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుగ్గారం: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా అర్హులైన పలువురికి ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతులు రాగా.. బుధవారం స్థానిక అధికారుల ఆధ్వర్యంలో ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. పంచాయతీ సెక్రటరీ అక్బర్ విధివిధానాలను లబ్ధిదారులకు వివరించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. నగునూరి నర్సాగౌడ్, జంగ శ్రీనివాస్, పొనకంటి కైలాసం తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్ కోరారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అధికారులతో కలిసి ముగ్గు పోశారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, కారోబార్ స్వామి, నాయకులు ఒరుగల శ్రీనివాస్, విజయభాస్కర్, వంశీధర్‌రావు, ప్రశాంత్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: దమ్మన్నపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి శంకర్ చేతుల మీదుగా ఇందిరమ్మ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ గంగాధర్, మాజీ ఉప సర్పంచ్ ముత్యాల శ్రీనివాస్ తదితరులున్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో, పీడీలు

కథలాపూర్: జెడ్పీ హైస్కూల్‌లో మండలస్థాయి క్రీడాపాఠశాల ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 11 మంది విద్యార్థులు ప్రతిభ చాటడంతో జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

మల్యాల: తాటిపల్లి గురుకులం నుంచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో నీలగిరి జయసింహారావు అభినందించారు. వీరు ఈనెల 26న జిల్లాకేంద్రంలోని స్వామి వివేకానంద స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మానస, పీడీ విశ్వప్రసాద్, అంజయ్య బాబాలక్ష్మి, గంగసాగర్,ఎ.శేఖర్, మధులిక పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 4వతరగతి స్పోర్ట్స్ స్కూల్ అడ్మిషన్లకు బుధవారం విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైనవారు ఈనెల 26న జగిత్యాలలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కృష్ణప్రసాద్, పొన్నం రమేశ్, గంగాధర్, రాజగోపాల్, సుజాత, రమేశ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష



సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్ తదితరులు

కోరుట్లరూరల్: మండల పరిధిలో నిర్వహించిన ఉపాధిహామీ, పారిశుధ్య పనుల తీరుతెన్నులపై బుధవారం మధ్యాహ్నం మండల పరిషత్ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి మదన్‌మోహన్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనులను నాణ్యతతో నిర్వహించాలన్నారు. ఎంపీడీవో ఒడెల రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, ఏపీవో మమత, లక్ష్మణ్, ఈసీ మాస్టర్ ట్రయినర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చూడాలి

కోరుట్ల: కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారి వెంట మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా షెడ్లు నిర్మించారని, వాటిని క్రమబద్ధీకరించి ప్రమాదాలు నివారించాలని కమిషనర్ మారుతిప్రసాద్‌కు మాజీ కౌన్సిలర్ బాబా వినతిపత్రం సమర్పించారు.

ఇంటి పన్నులు తగ్గించాలి

ధర్మపురి: మున్సిపల్ పరిధిలో భారీగా పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు కమిషనర్ రాజశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. సంగి సత్తమ్మ, రామన్న, అయ్యోరి రాజేశ్, ఆసిఫ్, ఎల్లాగౌడ్ తదితరులున్నారు.

నిరాదరణకు గురైన విగ్రహాలకు పూజలు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌వాడ సమీపంలో పురాతనమైన విగ్రహాలు కొన్నేళ్లుగా నిరాదారణకు గురై వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. స్థానిక విశ్వహిందూ పరిషత్ నాయకుల దృష్టికి రాగా.. మహిషాసుర మర్దిని, దుర్గాదేవి అమ్మవార్లకు పూజలు చేసి వెలుగులోకి తీసుకొచ్చారు. అవసరమైన స్థలాన్నివ్వడానికి యజమాని పదాల రాజన్న, వారి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు.